RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 176 | జూన్ 07, 2025 | వెల : రూ.3-00



నిజాయితీగా
సేవాలందించాలి
2లో..

- అక్కడ పేదలకు రూ.1000 కోట్లు ఖర్చు చేద్దాం
- నల్లగొండ రైతులకు మేలు చేసేలా "మూసీ" ప్రక్షాళన
- ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్ లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



# గోదావరితో మూసీని నింపుతాం

**వేద న్యూస్, ఆలేరు :**

తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గంలో మొత్తం రూ.1500 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. రూ.575 కోట్లతో గంధమల్ల జలాశయానికి(1.41 టీఎంసీలు) శంకుస్థాపన చేయగా, రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రూ.183 కోట్లతో యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాల, రూ.22.75 కోట్లతో దాతర్పల్లిలో వేర్హౌస్ కు, రూ.13.50 కోట్లతో కొలనుపాక, కాల్వపల్లి హైలెవల్ వంతెనలకు శంకుస్థాపన చేశారు. అలాగే మోటకొండూరులో ఎంపీపీ, తహసీల్దార్, పీఎస్ భవన నిర్మాణానికి, ఎంఆర్ఆర్, సీఆర్ఆర్ నిధులు కింద బీటీ రోడ్ల నిర్మాణానికి, రూ.2.75 కోట్లతో ఆలేరు మార్కెట్ యార్డు గోదాం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతామని, మూసీ ఒడ్డున పేదలకు రూ.1000 కోట్లయినా ఖర్చు చేద్దామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే ఈ మూసీ నది ప్రక్షాళనను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని సీఎం ధ్వజమెత్తారు.

అలాగే స్థానిక విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి అభివృద్ధి చేస్తామని, మూసీ ప్రక్షాళన చేసి నల్గొండ రైతులను ఆదుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. సబర్మతి, గంగా నదులు మాత్రం ప్రక్షాళన చేసుకోవచ్చన్నారు. మూసీ నదిని మాత్రం ప్రక్షాళన చేయవద్దానని ప్రశ్నించారు. నల్గొండ రైతులకు మేలు

మిగతా 4వ పేజీలో..



తొక్కిసలాటతో మాకేం

# సంబంధం లేదు

- ఆర్సీబీ, కర్ణాటక ప్రభుత్వానిదే బాధ్యత: కర్ణాటక క్రికెట్ బోర్డు
- ప్రభుత్వానిదే బాధ్యతన్న కేఎస్సీఏ, హైకోర్టులో పిటిషన్


**వేద న్యూస్, డెస్క్:**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ విజయోత్సవ సంబరాల్లో భాగంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి తమపై దాఖలైన

4లో..

ఈడీ, ఏసీబీ విచారణ

# మరింత వేగవంతం



**వేద న్యూస్, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టిస్తున్న మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వారం జరగాల్సి ఉన్న కోర్టు విచారణ మరోసారి వాయిదా పడింది. బెయిల్ ఇవ్వాలని నిందితులు దాఖలు చేసిన పిటిషన్లపై

4లో..



బెంగళూరు తొక్కిసలాట ఘటన..

# వెలుగులోకి దారుణాలు!

**వేద న్యూస్, బెంగళూరు :**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవంలో చిన్నస్వామి స్టేడియం వద్ద చోటు చేసుకున్న తొక్కిసలాటలో 11 మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. మృతుల్లో ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి గాథ. వీరిలో తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లా ఉడుమలైకు చెందిన వివేకానంద విద్యాలయ పాఠశాల కరస్పాండెంట్ కామాక్షి దేవి (28) కూడా ఉన్నారు. అవివాహిత అయిన కామాక్షి రాయల్

4లో..

భారత్‌లో మళ్లీ కరోనా వ్యాప్తి

# 5,300 యాక్టివ్ కేసులు

- రోజురోజుకు పెరుగుతున్న కరోనా వైరస్ కేసులు
- గడిచిన 24 గంటల్లో 498 కొత్త కొవిడ్ కేసులు నమోదు

**వేద న్యూస్, ఇంటర్నెట్ డెస్క్:**



భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి ఆందోళనకరంగా మారుతోంది. కొంతకాలంగా తగ్గుముఖం పట్టిన మహమ్మారి, తిరిగి విజృంభిస్తుండటంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతు న్నాయి. దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య ఐదు వేల మార్కును దాటింది. కేంద్ర ఆరోగ్య, కుటు ంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ రోజు ఉదయం 8 గంటలకు విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం పలు కీలక వివరాలు వెల్లడయ్యాయి. గడిచిన 24 గంటల వ్యవధిలో

4లో..



బాలికపై సామూహిక

# అత్యాచారం

దళిత బాలికపై సామూహిక లైంగిక దాడి, గర్భవతి అయిన బాలిక

**వేద న్యూస్, పుట్టపర్తి :**

తొమ్మిదో తరగతి చదువుతోన్న ఓ దళిత బాలికను పలువురు యువకులు మాయ మాటలతో మభ్యపెట్టారు. ఆ క్రమంలో ఆ బాలికపై వారు సామూహిక లైంగిక దాడి చేశారు. ఈ నేపథ్యంలో ఆ బాలిక గర్భవతి అయింది. అయితే ఆ బాలిక ఇటీవల కాలంలో తరచూ తీవ్ర అనారోగ్యానికి గురవుతోంది. దీంతో ఆమెను తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు ఆ బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి.. ఆమె గర్భవతి అని తెలిపారు. ప్రస్తుతం ఆ బాలికకు ఆరో నెల అని వైద్యులు వెల్లడించారు. దీంతో కుమార్తెను నిలదీయడంతో.. జరిగిన సంఘటనను తన తల్లిదండ్రులకు వివరించింది. అనంతరం వారు పోలీసులను

4లో..

బనకచర్లపై ఘాటుగా

# స్పందించిన మంత్రి ఉత్తమ్

**వేద న్యూస్, హైదరాబాద్ :**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్ట్‌పై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరోసారి స్పందించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, సెంట్రల్ వాటర్ కమిషన్, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి విరుద్ధమని స్పష్టం చేశారు. అంతేకాదు.. అంతర్రాష్ట్ర జల విధానానికి సైతం ఈ ప్రాజెక్ట్ విరుద్ధమన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదని ఆయన పునరుద్ఘాటించారు. ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఈ బనకచర్ల ప్రాజెక్ట్ విషయాన్ని ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు జలశక్తి శాఖ

4లో..

మెడపై తుపాకీ పెట్టినా

# నిజాలే చెబుతా



**వేద న్యూస్, హైదరాబాద్ :**

కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలని.. రిపోర్ట్ విషయంలో తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కాళేశ్వరం విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కంఠంపై తుపాకీ పెట్టినా ఈటెల నిజమే మాట్లాడుతారు అని స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు డిజైన్లు, నిర్మాణంతో సంబంధం ఉందా అని

3లో..

వేద న్యూస్

శనివారం జూన్ 07, 2025

# వికసిత్ భారత్ లక్ష్యంగా బిజెపి పని చేస్తుంది

**వేద న్యూస్, శాయంపేట :**




శాయంపేట మండల కేంద్రంలో బిజెపి మండల నూతన కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు జన్నే మొగిలి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి పదకొండు సంవత్సరాలు అవుతున్న సందర్భంగా వికసిత్ భారత్ లక్ష్యంగా బిజెపి పని చేస్తుందనీ ,భారతదేశం లొ 2047 నాటికి పూర్తిగా వికసిత దేశంగా మారాలన్న ది ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యం అన్నారు. భారతదేశం స్వాతంత్ర్యం సాధించి వంద సంవత్సరాలు పూర్తయ్యే సమయానికి దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన దేశంగా నిలిపే లక్ష్యంతో నరేంద్ర మోడీ గారు పని చేస్తున్నారని వారు తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యం ముఖ్యంగా ఆర్థిక అభివృద్ధి,భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామి ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా తీర్చిదిద్దడం ,ఉత్పాదకతను పెంచడం, ఉద్యోగావకాశాలను సృష్టించడం,ఐటీ, మ్యాన్ ఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది అని అన్నారు.

సమాజ పరంగా సమగ్రత సామాజిక సమానత్వం, లింగ సమానత్వం, విద్యా వృద్ధి,ఆరోగ్య సదుపాయాల వృద్ధి ,పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించడం, పరిశుభ్రమైన, పర్యావరణ పరిరక్షణతో కూడిన అభివృద్ధి,గ్రీన్ ఎనర్జీ, పునరుత్పాదక శక్తుల ప్రోత్సాహం, కాలుష్య నియంత్రణ, నీటి వనరుల పరిరక్షణ వికాసిత్ భారత్ లక్ష్యం అన్నారు.

సాంకేతికత ఆధారిత అభివృద్ధి డిజిటల్ ఇండియా అభియాన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ వంటి రంగాల్లో ముందంజ వలన భారత విలువలు, సంస్కృతిని పరిరక్షించుకుంటూ అభివృద్ధి గా ఎదగటం, సంస్కృతి, భాషలు, సంప్రదాయాలను గౌరవిస్తూ ఆధునికతను అంగీకరించడం ఇది భారత యువతకు ఒక ప్రేరణాత్మక దిశను చూపుతుంది వివరించారు. దీని ద్వారా ప్రభుత్వ విధానాలు, పెట్టుబడులు, సంస్కరణలు ఒక దీర్ఘకాలిక దృష్టికోణంతో అమలవుతాయి అన్నారు.ప్రపంచవ్యాప్తంగా భారతదేశ స్థానం మరింత శక్తివంతంగా మారుతుంది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ కానుగుల నాగరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు, యువ మోర్చా జిల్లా కార్యదర్శి లాడే శివ, మండల ఉపాధ్యక్షుడు కోమటి రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శులు మామిడి విజయ్, భూతం తిరుపతి, మండల కార్యదర్శులు మేకల సుమన్, వంగరి శివ శంకర్,కొంగరి భారతి, సీనియర్ నాయకులు మోత్కూరు సత్యనారాయణ, బూత్ అధ్యక్షులు కడారి చంద్రమౌళి, వంగల భాస్కర్ రెడ్డి, మునుకుంట్ల చంద్రమౌళి, కన్నెబోయిన రమేష్, మూడేడ్ల పైడి, పరుషబోయిన శంకర్, బత్తుల రాజేష్, కొంగర సుధాకర్, ఎర్ర తిరుపతిరెడ్డి, మూడేడ్ల రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

**వేద న్యూస్, కాశీబుగ్గ :**

పేదింటి ఆడబిడ్డలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ అడుప మహేష్ అన్నారు. శుక్రవారం 14వ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు లబ్ధిదరులకు కళ్యాణ లక్ష్మి /షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, పీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ అడుప మహేష్ మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు రావాలంటే అనేక నెలలు సమయం పట్టేదని కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్కువ సమయంలోనే చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు పస్తం శంకర్, ఏనుమాముల గ్రామ అధ్యక్షుడు సౌరం చిన్ని, బాలాజీ నగర్ గ్రామ అధ్యక్షుడు కడెం కుమార్, ఎస్సార్ నగర్ గ్రామ అధ్యక్షుడు మచ్చర్ల స్టాలిన్,ఇందిరమ్మ కమిటీ మెంబర్ పత్రి రాజేష్, 14వ డివిజన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సుందరయ్య నగర్ గ్రామ అధ్యక్షుడు త్రికోవెల శీను, సౌరం ప్రభాకర్ ,సౌరం అభిలాష్, ఎండి సంధాని, ఇసుబ్, ముసలమ్మ కుంట ఫేస్ వన్ కాశెట్టి కమలాకర్, ఇందిరమ్మ కమిటీ మెంబర్ ఏకాబ్రచారి, తిరుపతి దస్రు నాయక్, ఎస్సార్ నగర్ యూత్ అధ్యక్షుడు తాళ్ల పెల్లి రాకేష్, పల్లకొండ చందు తదితరులు పాల్గొన్నారు.




# మొరాయిస్తున్న సర్వర్లు




**వేద న్యూస్,దామరచర్ల :**

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మూడు నెలల సన్న బియ్యం ఒకే నెలలో పంపిణీ చేస్తుంది.ఈ కార్యక్రమంలో భాగంగా దామరచర్ల మండల కేంద్రంలో శుక్రవారం నాడు సాయంత్రం ప్రభుత్వ చౌక ధరల దుకాణం వద్ద జనాలు బారులు తీరారు.రేషన్ డీలర్ల వద్ద ఉన్నటువంటి ఈపాస్ మిషన్లో సర్వర్లు నెట్వర్క్ సరిగా అందక జనాలు గంటల తరబడి రేషన్ షాపుల వద్ద వేచి చూడాల్సి వస్తుంది.ఈ సమస్య ప్రతి గ్రామంలో ఉండటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# సబ్ కలెక్టర్ నివాసగృహంలో అగ్నిప్రమాదం



వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి : నల్గొండ జిల్లా అదనపు కలెక్టర్.. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఉంటున్న నివాసంలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. షార్ట్ సర్క్యూట్ దాటికి ఇంట్లో స్వల్పంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## రెవెన్యూ సదస్సుల ద్వారా
# భూ సమస్యల పరిష్కారం

**వేద న్యూస్, నల్లగొండ ప్రతినిధి :**




కేతపల్లి మండలంలోని భీమవరం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ భూభారతి చట్టం పై రైతులకు ప్రజలకు రెవిన్యూ సదస్సును స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా నల్గొండ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యలు అనగా వారి భూమికి సర్వే నంబర్లు తప్పుగా ఉండడం ఆన్లైన్లో భూమి నమోదు కాకపోవడం భూమి ఒకరి పేరు మీద ఒకరికి ఉండడం వివిధ రకాల భూ సమస్యలను సులభతరంగా రెవిన్యూ ద్వారా భూభారతి చట్టంలో పొందుపరిచి ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా భూభారతి చట్టం పనిచేస్తుందని అన్నారు. ఈ యొక్క అవకాశాన్ని రైతులు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేతపల్లి మండల డిప్యూటీ తహసిల్దార్ సత్తార్, పంచాయతీ కార్యదర్శి అనిల్, రెవెన్యూ అధికారులు ఆనంద్, అశ్విని, సంధ్య, విజయ్, గ్రామ నాయకులు మాజీ సర్పంచ్ బడుగుల నరేందర్ యాదవ్, గ్రామపంచాయతీ సిబ్బంది రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఉచిత వాలీబాల్ శిక్షణ

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని 6వ వార్డు ఇందిరమ్మ కాలనీ లోమిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి సహకారంతో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగియబడింది.మే నెల నుంచి జూన్ 6 తారీకు వరకు ఈ సమ్మర్ వాలీబాల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కోచ్ టాంక్ జస్రత్ సింగ్ మాట్లడుతూ డివైస్ఓ ఆధ్వర్యంలో ఈ వేసవిలో క్రీడల పట్ల మానసిక ఉల్లాసాన్ని కల్పించడానికి ఇందిరమ్మ కాలనీ లో వాలీబాల్ 30 మంది క్రీడాకారులకి నేర్పించడం జరిగింది అన్నారు.ఈ శిక్షణ శిబిరానికి ఆర్థిక సాయం అందించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డికి క్రీడాకారులందరూ ధన్యవాదాలు తెలిపారు. మొదటినుంచి ఈ శిక్షణ శిబిరానికి వారు ఎంతో సహకరించారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,క్రీడాకారులు మరియు కాలనీ వసూలు బౌండ్ జరావర్ సింగ్,ట్యాంక్ హుజూర్ సింగ్,బౌరీ,జోర్ సింగ్,కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు అంబటి వెంకటకృష్ణ తో పాటు గ్రౌండ్ ఇంచార్జ్ బాబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయస్థానం వాయిదాలకు
# హాజరుకాని వ్యక్తి కి రిమాండ్

**వేద న్యూస్, శాయంపేట:**

దొంగతనం కేసులో న్యాయస్థానం వాయిదాలకు హాజరు కానీ వ్యక్తినీ అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పరకాల గ్రామ నివాసి అయినా మోరె సాయి కుమార్ అతని పై గత సంవత్సరంలో దొంగతనం కేసు శాయంపేట పోలీస్ స్టేషన్ లో నమోదు చేయగా గత కొంత కాలం నుండి కోర్ట్ కు గైర్హాజరు అయినందున మోరె సాయికుమార్ పై పరకాల కోర్ట్ వారెంటు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు మోరె సాయి కుమార్ ను అరెస్ట్ చేసి కోర్టు కు హాజరు పరచగా పరకాల కోర్టు రిమాండ్ చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్వర్ తెలిపారు.

# ఆత్మహత్య యత్నంకు కారణాలైన ఐదుగురుపై కేసు నమోదు

**వేద న్యూస్, శాయంపేట:**

భూమి హద్దుల విషయంలో గొడవ జరగడం వలన నూనె తిరుపతి మనస్థాపంచేంది ఆత్మహత్యయత్నం కు కారణం ఐన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం శాయంపేట మండలం మైలారం గ్రామస్తుడు అయిన సిరిపురం రాజయ్యకు అదే గ్రామానికి చెందిన నూనె తిరుపతి అను అతనికి భూమి హద్దుల విషయంలో గొడవ జరిగింది. సిరిపురం రాజయ్య నూనె తిరుపతిని అతని భార్య సునీతను తిట్టగా మనస్థాపం చెందిన నూనె తిరుపతి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేయగా కుటుంబ సభ్యులు నూనె తిరుపతి ని హాస్పిటల్ లో చేర్పించారు.నూనె తిరుపతి ఆత్మహత్య యత్నం చేసుకోడానికి కారణం అయిన సిరిపురం రాజయ్య ను పెద్ద మనుషులు అయిన చల్ల చక్రపాణి, ఏనుగుల చిన్న అశోక్, పంచగిరి నర్సయ్య పై కేసు నమోదు చేసి సిరిపురం రాజయ్య ను రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్వర్ తెలిపారు.




# నిజాయితీగా సేవాలందించాలి

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

నిజాయితీగా ప్రజలకు సేవాలందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రాయపర్తి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై గా భాధ్యతలు చేపట్టిన యం. రాజేందర్ శుక్రవారం పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం అందించే విధంగా విధులు నిర్వహించాలని సీపీ ఎస్సై కి తెలిపారు.

# నాణ్యమైన వైద్యం అందించడమే మా లక్ష్యం



**వేద న్యూస్, సూర్యపేట ప్రతినిధి:**

నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సంకల్పంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత పట్టాభి పిల్లల ఆసుపత్రిలో నూతనంగా లోటస్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ను ప్రారంభించడం జరిగిందని పిల్లల ప్రత్యేక వైద్యనిపుణులు డాక్టర్ భాగ్యశ్రీ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత పట్టాభి హాస్పిటల్ లో నూతనంగా లోటస్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ను జానీ బేగం రిబ్బన్ కట్ చేసే ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాగ్యశ్రీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. 24 గంటల పాటు చిన్నారులకు వైద్యాన్ని అందించేందుకు తమ ఆసుపత్రి అందుబాటులో ఉంటుందన్నారు. 0-13 సంవత్సరాల చిన్నారులకు అన్ని రకాల ఎన్సీయు కేర్, ఫోటో థెరపీ, జాండీస్, పీడియాట్రిక్, దగ్గు, జలుబు అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందించడం జరుగుతుందన్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాషా, సయ్యద్ జానీ, రియాజ్, మతిన్, షఫీ, సత్యం తదితరులు ఉన్నారు.

# సంపాదకీయం

## పుస్తకాల రవాణాకు ఉత్తమమార్గం

భారతీయ తపాలా శాఖ ఎల్లప్పుడూ తన వినియోగదారుల మారుతున్న అవసరాలను గుర్తించి, వారికి మరింత మెరుగైన, వినూత్నమైన సేవలను అందించడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటుంది. విద్యార్థులు విజ్ఞానాన్ని అభ్యసించేందుకు, పుస్తకాలను అమితంగా ప్రేమించే పాఠకుల ప్రత్యేకమైన ఆకాంక్షలను నెరవేర్చడానికి, వారికి సౌకర్యవంతంగా ఉండేలా 'జ్ఞాన పోస్ట్' అనే ఒక ప్రత్యేకమైన సేవను ప్రారంభించింది. ఈ వినూత్నమైన సేవ ద్వారా విద్యార్థులు, పుస్తక ప్రియులు తమకు అవసరమైన పుస్తకాలను, విద్యా సంబంధిత మెటీరియల్‌ను దేశంలోని ఏ ప్రాంతానికైనా పోస్ట్ ఆఫీస్ ద్వారా చాలా సులభంగా, వేగంగా, విశ్వసనీయంగా పంపడానికి లేదా స్వీకరించడానికి అవకాశం లభిస్తుంది. గతంలో అందుబాటులో ఉన్న 'ప్రింటెడ్ బుక్ పోస్ట్' సేవ కొన్ని నిర్దిష్టమైన పరిమితులను కలిగి ఉండటం వలన, దానిని గత సంవత్సరం అక్టోబర్ నెలనుండి పూర్తిగా నిలిపివేసి, విద్యార్థుల ఉన్నతమైన విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, వారి సౌలభ్యం కోసం ప్రత్యేకంగా ఈ 'జ్ఞాన పోస్ట్' సేవను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ నూతన సేవ విద్యార్థులకు, పుస్తక ప్రియులకు ఒక గొప్ప వరంగా నిలుస్తుంది. 'జ్ఞాన పోస్ట్' సేవ ద్వారా పుస్తకాలను పంపడానికి అయ్యే ఖర్చు చాలా సరసమైనదిగా, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్ణయించబడింది. ఈ సేవను ఉపయోగించుకునే ఎక్కువ మంది విద్యార్థులు, పుస్తక ప్రియులకు ఇది ఆర్థికంగా కూడా భారంగా ఉండదు. 300 గ్రాముల బరువు వరకు ఉండే పుస్తకాల కోసం కేవలం 20 రూపాయలు మాత్రమే చెల్లించవలసి ఉంటుంది. ఇది తక్కువ చెల్లింపు కావడంతో ఈ సేవను సులభంగా ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా మీరు పంపిన పుస్తకం ప్రయాణాన్ని, అది ప్రస్తుతం ఏ స్థితిలో ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలనుకుంటే, భారతీయ తపాలా శాఖ 'ట్రాక్ అండ్ ట్రేస్' అనే ఒక అదనపు, అత్యంత ఉపయోగకరమైన సౌకర్యాన్ని కూడా అందిస్తోంది. ఈ సౌకర్యాన్ని పొందడానికి, మీరు అదనంగా మరో 17 రూపాయలు మాత్రమే చెల్లించవలసి ఉంటుంది. దీని ద్వారా, మీరు మీ పుస్తకం ప్రస్తుత స్థానాన్ని, అది ఎప్పుడు డెలివరీ అవుతుందో మీ మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా ఎక్కడి నుండైనా సులభంగా తెలుసుకోవచ్చు. ఈ సౌకర్యం పంపినవారికి, స్వీకరించేవారికి కూడా మరింత భద్రతా భావాన్ని, మనశ్శాంతిని కలిగిస్తుంది. తద్వారా వారు తమ వస్తువు డెలివరీ గురించి నిశ్చింతగా ఉండగలరు.

'జ్ఞాన పోస్ట్' ద్వారా పంపడానికి అనుమతించబడిన వివిధ రకాల పుస్తకాలు: గుర్తింపు పొందిన విద్యా బోర్డులు (ఉదాహరణకు: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ – సిబిఎస్‌సి, స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ – ఎస్ఎస్‌సి, ఇండియన్ సర్టిఫికేట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ –ఐసిఎస్ఇ), భారత ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాలచే గుర్తింపబడిన విశ్వవిద్యాలయాలలో చదువుతున్న విద్యార్థులకు వారి కరస్పాండెన్స్ (దూరవిద్య) లేదా రెగ్యులర్ (ప్రత్యక్ష) కోర్సుల సిలబస్‌లో సూచించబడిన అన్ని రకాల ప్రామాణికమైన, విద్యా సంబంధిత పుస్తకాలను ఈ ప్రత్యేకమైన సేవ ద్వారా పంపవచ్చు. ఇది విద్యార్థులకు వారి విద్యాభ్యాసానికి అవసరమైన ముఖ్యమైన స్టడీ మెటీరియల్‌ను ఎటువంటి ఇబ్బందిలేకుండా, చాలా త్వరగా పొందడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, వివిధ రకాల పోటీ పరీక్షలకు (ఉదా: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ –యుపిఎస్‌సి, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ %–% ఎపిపిఎస్‌సి, తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ – టిఎస్‌పిఎస్‌సి, బ్యాంక్ పరీక్షలు, వివిధ ప్రవేశ పరీక్షలు %–% జెఇఇ, నీట్, ఎంసెట్ మొదలైనవి) సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఉపయోగించే ప్రామాణికమైన, సిలబస్‌కు సంబంధించిన అన్ని రకాల సహాయక పుస్తకాలను కూడా ఈ సేవ ద్వారా పంపడానికి అనుమతి ఉంది. వీటితోపాటు, సమాజం వివిధ ముఖ్యమైన అంశాలైన సంస్కృతి, మతం, ఇతర సామాజిక సంబంధిత విషయాలకు సంబంధించిన విలువైన సాహిత్యం, ఏదైనా సంబంధిత భారతీయ చట్టానికి పూర్తిగా లోబడి అధికారికంగా జారీ చేయబడిన లేదా ప్రచురించబడిన పుస్తకాలను కూడా 'జ్ఞాన పోస్ట్' ద్వారా పంపవచ్చు.అయితే, ఈ విషయంలో భారతీయ తపాలా శాఖ నిర్దేశించిన అన్ని నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది. 'జ్ఞాన పోస్ట్' సేవను ఉపయోగించడానికి నియమాలు: ఈ నియమాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా, పంపినవారు, స్వీకరించేవారు ఇద్దరూ ఎటువంటి అనవసరమైన సమస్యలు లేకుండా ఈ సేవ పూర్తిస్థాయి ప్రయోజనాలను పొందవచ్చు. మొదటగా 'జ్ఞాన పోస్ట్' ద్వారా పంపే ప్రతి ప్యాకెట్ బరువు విషయంలో ఒక నిర్దిష్ట పరిమితిని భారతీయ తపాలా శాఖ స్పష్టంగా నిర్దేశించింది. మీరు పంపే ప్రతి ప్యాకెట్ తప్పనిసరిగా కనీసం 300 గ్రాముల బరువును కలిగి ఉండాలి. అంతకంటే తక్కువ బరువు ఉన్న చిన్న ప్యాకెట్‌లను ఈ ప్రత్యేకమైన సేవ ద్వారా పంపడానికి అనుమతించబడదు.

అదే సమయంలో మీరు పంపే ప్యాకెట్ గరిష్ఠ బరువు మాత్రం 5 కిలోలను మించకూడదు. ఒకవేళ పంపాలనుకుంటున్న ప్యాకెట్ 5 కిలోల కంటే ఎక్కువ బరువును కలిగి ఉంటే, అది 'జ్ఞాన పోస్' సేవకు అర్హత పొందదు. దానిని సాధారణ పార్సల్ సేవ ద్వారా మాత్రమే పంపవలసి ఉంటుంది. అందువల్ల, పంపే ముందు మీ ప్యాకెట్ బరువును సరిగ్గా తనిఖీ చేసుకోవడం చాలా ముఖ్యం. రెండవది 'జ్ఞాన పోస్ట్' సేవ ప్రధాన, ముఖ్యమైన ఉద్దేశం వ్యక్తిగత, విద్యా సంబంధిత అవసరాలను మాత్రమే తీర్చడం. అందువల్ల ఎలాంటి వాణిజ్యపరమైన పుస్తకాలను (అంటే, వ్యాపార లాభాలకోసం పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి తిరిగి విక్రయించే ఉద్దేశంతో ఉన్న పుస్తకాలు) ఈ ప్రత్యేకమైన సేవద్వారా పంపడానికి ఖచ్చితంగా అనుమతి లేదు. ఈ నియమం ముఖ్య ఉద్దేశం ఏమిటంటే ఈ సేవ నిజంగా విద్యను అభ్యసించే విద్యార్థులు, జ్ఞానాన్ని పొందాలనుకునే పాఠకులకు మాత్రమే అందుబాటులో ఉండాలి, వ్యాపార ప్రయోజనాల కోసం కాదు. మూడవది, ఒక నిర్దిష్ట, క్రమమైన వ్యవధిలో క్రమం తప్పకుండా ప్రచురించబడే పుస్తకాలు, పత్రికలు లేదా ఇతర క్రమానుగత ప్రచురణలు ఈ సేవ ద్వారా పంపడానికి అర్హత పొందవు. ఉదాహరణకు, వారపత్రికలు, పక్షపత్రికలు, నెలవారీ మ్యాగజైన్‌లు, రెండు నెలలకోసారి వచ్చే ప్రచురణలు, త్రైమాసిక పత్రికలు, అర్ధ వార్షిక పత్రికలు, ఇలాంటి ఇతర క్రమానుగత ప్రచురణలను 'జ్ఞాన పోస్ట్' ద్వారా పంపకూడదు. ఈ నియమం ముఖ్య కారణం ఏమిటంటే, ఈ సేవ ప్రత్యేకంగా విద్యా సంబంధిత పుస్తకాలు, స్టడీ మెటీరియల్ కోసం మాత్రమే ఉద్దేశించబడింది, క్రమం తప్పకుండా వచ్చే పత్రికల వంటి వాటి కోసం కాదు. నాల్గవది, మీరు పంపే పుస్తకాలపై కేవలం పుస్తకాల జాబితా లేదా విషయ సూచిక మాత్రమే ఉండాలి. పుస్తకాల రచయిత పేరు లేదా ప్రచురణకర్త పేరు వంటి సమాచారం ఉండవచ్చు. కానీ ఎలాంటి ప్రకటనలు (అంటే, ఇతర ఉత్పత్తులు లేదా సేవలను ప్రోత్సహించే ప్రకటనలు) పుస్తకాలపై లేదా ప్యాకెట్‌లో ఉండకూడదు. ప్రకటనలు లేని స్వచ్ఛమైన విద్యా సంబంధిత మెటీరియల్‌ను మాత్రమే ఈ సేవ ద్వారా పంపాలి. ఒకవేళ ప్రకటనలు ఉన్నట్లు కనుగొనబడితే, మీ ప్యాకెట్ సాధారణ పార్సల్ ఛార్జీలకు లోబడి ఉంటుంది. చివరగా, మీరు పంపే ప్యాకెట్‌లోని ప్రతి పుస్తకంపై తప్పనిసరిగా ప్రింటింగ్ ప్రెస్ పేరు లేదా పుస్తకాన్ని ప్రచురించిన ప్రచురణకర్త పేరు స్పష్టంగా ముద్రించి ఉండాలి. ఈ ముఖ్యమైన నియమం పుస్తకం మూలాన్ని, దాని ప్రామాణికతను నిర్ధారించడానికి సహాయపడుతుంది. ఈ నియమాలన్నింటినీ మీరు తప్పనిసరిగా పాటించడం ద్వారా, 'జ్ఞాన పోస్ట్' సేవను ఎటువంటి ఇబ్బంది లేకుండా, చాలా సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు. 'జ్ఞాన పోస్ట్' సేవ భారతీయ తపాలా శాఖ ఒక గొప్ప విజయవంతమైన ప్రయత్నం. ఇది విద్యార్థులు, పుస్తక ప్రియులకు సరసమైన ధరలలో వేగవంతమైన, సురక్షితమైన పుస్తకాల పంపిణీ సేవను అందిస్తుంది. ఈ సేవ ద్వారా విద్యా సంబంధిత పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్, ప్రామాణికమైన సాహిత్యాన్ని సులభంగా పంపవచ్చు, ఇది విద్యా రంగానికి ఒక పెద్ద మద్దతుగా నిలుస్తుంది. ఈ నూతన సేవ విద్యార్థుల జీవితాలను సులభతరం చేస్తుంది, జ్ఞానవ్యాప్తికి ఒక ముఖ్యమైన సాధనంగా మారుతుంది.

# గాజాలో శాశ్వతంగా కాల్పులు విరమించాలి

**వేద న్యూస్, డెస్క్:**



గాజాలో బేషరతుగా, శాశ్వతంగా తక్షణమే కాల్పుల విరమణ జరపాలని డిమాండ్ చేస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని అమెరికా బుధవారం ఏకపక్షంగా తోసిపుచ్చింది. ఇందుకు తన వీటో అధికారాన్ని ఉపయోగించుకుంది. తద్వారా మానవతా సంక్షోభాన్ని పరిష్కరించాలన్న విజ్ఞప్తులను పెడచెవిన పెట్టింది. భద్రతా మండలిలోని పది తాత్కాలిక సభ్య దేశాలు ఈ తీర్మానాన్ని రూపొందించాయి. హమాస్‌అదుపులో వున్న బందీలను వెంటనే విడుదల చేయాలని కూడా ఆ తీర్మానం డిమాండ్ చేసింది. మానవతా సాయంపై విధించిన ఆంక్షలన్నింటినీ ఎత్తివేయాలని, గాజాలో అత్యవసరసేవలను అందించాలని తీర్మానం కోరింది. ఇజ్రాయిల్‌ను నేరుగా, కఠినంగా విమర్శించడాన్ని కుదిస్తూ, పరుషమైన పదజాలం కాకుండా సున్నితమైన భాషనే ఉపయోగించి తీర్మానాన్ని రూపొందించినప్పటికీ అమెరికా ఈ తీర్మానాన్ని వీటో చేసింది. పైగా ఖతార్, ఈజిప్ట్, అమెరికా నేతృత్వంలో జరుగుతున్న దౌత్య ప్రయత్నాలకు కూడా మద్దతిచ్చింది. అయినా అమెరికా ఆ తీర్మానాన్ని వ్యతిరేకించింది.హమాస్‌ను ఖండించడంలో విఫలమైన ఏచర్యకూ అమెరికా మద్దతివ్వబోదని ఐరాసలో అమెరికా రాయబారి డొరొతి షా స్పష్టం చేశారు. హమాస్ ఆయుధాలను అప్పగించి, గాజా నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. గాజాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇజ్రాయిల్‌ను విమర్శించే తీర్మానాలను అమెరికా ఇలా వీటో చేయడం ఇది ఆరవసారి. ఇజ్రాయిల్‌కు సాంప్రదాయ మిత్రదేశాలైన ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు కూడా అంతర్జాతీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని తమ వైఖరిని మార్చుకుని కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తున్నాయి. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా, గాజా ఆహార పంపిణీ కేంద్రాలపై ఇజ్రాయిల్ దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

# మెడపై తుపాకీ పెట్టినా నిజాలే చెబుతా

మొదటి పేజీ తరువాయి

కమిషన్ అడిగిందని.. తనకేం సంబంధం లేదని చెప్పానన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్‌పై అధికారం ఉండేదా అని అడగ్గా.. తనకు ఎలాంటి అధికారం లేదని చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం క్వాలిటీ గురించి ఇంజనీర్లు చూసుకోవాలని.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరీష్ నాయకత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. మంత్రివర్గ ఉపసంఘం, సీడబ్ల్యూసీ రిపోర్ట్ ఆర్థిక శాఖ ముందు పెట్టారని తెలిపారు. నిజాయితీగా ఉండాలని కోరే పార్టీ బీజేపీ అని ఎంపీ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త కేసీఆర్ అని ఆయనే చెప్పుకున్నారని.. ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ఆనాటి ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై నిర్ణయం తీసుకుంది కేసీఆర్ అని.. అప్పుడు ఆయనే బాస్ అన్నారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ పార్టీలో ఉన్నా వాల్యూతో ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో మొట్టమొదటి ఆర్థిక మంత్రిగా పనిచేశానన్నారు. తెలంగాణ సాధించుకుంది నీళు ,, నిధులు, ఉద్యోగాల కోసమని చెప్పారు. 2006లో తుమ్మిడి హెట్టి రూ.16 వేలు ఉంటే 2015లో రూ.38 వేల కోట్లకు పెరిగిందన్నారు. తుమ్మిడి హెట్టి దగ్గర కట్టాలని అనుకున్నా మహారాష్ట్ర ఒప్పుకోలేదన్నారు. మూడు బ్యారేజీలు సీడబ్ల్యూసీ రిపోర్ట్, టెక్నికల్ కమిటీ ఆధ్వర్యంలో కట్టారన్నారు. మూడు బ్యారేజీలు సబ్ కమిటీ, టెక్నికల్ కమిటీ రిపోర్టు ఆధారంగా కట్టారని వెల్లడించారు. మొదట రూ.63వేల కోట్ల అంచనాతో ప్రారంభం అయితే.. రైతుల డిమాండ్ మేరకు రూ.82 వేల కోట్లకు పోయిందన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏ పర్పస్ కోసం పెట్టారని కమిషన్ ప్రశ్నిస్తే.. కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఫైనాన్స్ శాఖకు సంబంధం లేదని చెప్పినట్లు తెలిపారు.

# నిరుపేద కుటుంబానికి పుస్తెమెట్టలు అందజేత

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామానికి చెందిన వల్లంపట్ల ఆరోను జోజమ్మ పెద్ద కుమారుడు వల్లంపట్ల దయాకర్–సుమతి వివాహ వేడుకలు లక్ష్మీదేవి గూడెం క్రాస్ రోడ్డు లో గల శ్రీ వెంకటేశ్వర్ల ఫంక్షన్ హాల్ నందు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఆయన నిరుపేద కుటుంబం అవడంతో పుస్తెమెట్టలు అందించారు. అనంతరం నూతన దంపతులను ఆశీర్వదించారు.నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కళ్యాణం కమనీయంగా జరిగిందని అభివర్ణించారు. ఆయన వెంట సలికొలిమిల బిక్షమాచారి, వల్లంపట్ల కోటయ్య,మేక దేవరాజు, మేక మాణిక్యం, విఆర్ఓ వల్లంపట్ల పోచయ్య, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ బంటు కృష్ణ , పాల్గొన్నారు.



# భారత్‌తో చర్చలు జరిపేందుకు అవకాశం కల్పించాలి

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

భారత్, పాక్‌ల మధ్య ఇటీవల తలెత్తిన ఉద్రిక్తతలను నివారించడంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పోషించిన పాత్రను పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) చీఫ్ బిల్వాల్ భుట్టో జర్దారి ప్రశంసించారు. బుధవారం జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో వారు వేర్వేరుగా ట్రంప్‌ను ప్రశంసించారు. భారత్‌తో సమగ్రంగా చర్చలు జరిపేందుకు అవకాశం కల్పించేలా చూడాల్సిందిగా వారు ట్రంప్‌ను కోరారు. అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకోవడంపై కూడా వారు మాట్లాడారు. పాకిస్తాన్‌తో ఘర్షణలను నివారించేలా చూడడంలో తాను కీలకంగా వ్యవహరించానని ట్రంప్ పదేపదే చెప్పుకుంటుండగా, భారత్ ఆ వాదనలను నిర్ద్వంద్వంగా ఖండిస్తూ వస్తోంది. తమ రెండు దేశాలు ద్వైపాక్షికంగానే ఈ విషయాన్ని పరిష్కరించుకున్నాయి, తప్ప ట్రంప్ ప్రమేయం లేదని తేల్చి చెప్పింది, ఈ నేపథ్యంలో పాకిస్తాన్ నేతలు ట్రంప్ జోక్యాన్ని ప్రశంసిస్తూ వ్యాఖ్యలు చేయడం విశేషం.

# ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు హత్య బెదిరింపు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**




ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. దాంతో, అధికారులు అప్రమత్తమయ్యారు. ఆమె భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పొరుగున ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ నగర పోలీసు కంట్రోల్ రూమ్‌కు (పీసీఆర్) గురువారం రాత్రి ఓ ఆగంతకుడు ఫోన్ చేసి ఈ బెదిరింపులకు పాల్పడినట్లు ఓ అధికారి వెల్లడించారు. ఘజియాబాద్ నగర డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సిటీ) తెలిపిన వివరాల ప్రకారం, గురువారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి పీసీఆర్‌కు ఫోన్ చేసి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను చంపుతామని బెదిరించాడు. ఆ తర్వాత వెంటనే తన మొబైల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన ఘజియాబాద్ పోలీసులు, తమ అంతర్రాష్ట్ర సమన్వయ విభాగం ద్వారా ఢిల్లీ పోలీసులకు సమాచారం అందించారు. బెదిరింపు కాల్ వచ్చిన ఫోన్ నంబరుకు చెందిన సిమ్ కార్డు యజమానిని టెలికాం సంస్థ సహకారంతో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అయితే, గురువారం రాత్రి 11 గంటల నుంచి ఆ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో, నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ బెదిరింపు నేపథ్యంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా భద్రతా వలయాన్ని పటిష్టం చేయడంతో, ఆమె బహిరంగ కార్యక్రమాలు, ప్రజలతో సమావేశాలపై ఈ ప్రభావం చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రులపై ఇలాంటి బెదిరింపులు, దాడులు జరగడం కొత్తేమీ కాదు. గతంలో కూడా పలుమార్లు ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. 2019లో, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై ఓ ఆటోరిక్షా డ్రైవర్ చెంపదెబ్బ కొట్టారు. ఎన్నికల హామీలు నెరవేర్చలేదనే కోపంతో ఆ వ్యక్తి ఈ దాడికి పాల్పడ్డాడు. అంతకుముందు, 2016లో ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో జరిగిన ఓ అధికారిక కార్యక్రమంలో కేజ్రీవాల్‌పై కొందరు నల్ల సిరా చల్లారు. నగరంలో సీఎన్‌జీ వాహనాలకు స్టిక్కర్లు జారీ చేయడంలో కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ పంజాబ్‌కు చెందిన ఓ సంస్థకు చెందిన మహిళ ఈ దాడి చేసింది. అప్పుడు కేజ్రీవాల్ తన ప్రభుత్వం అమలు చేసిన "సరి–బేసి" వాహన నియంత్రణ విధానం విజయంపై బహిరంగ సభలో ప్రసంగిస్తున్నారు.

ఇక, 2025 ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కూడా కేజ్రీవాల్ భద్రతకు సంబంధించి ఓ ఆందోళనకర ఘటన జరిగింది. ఢిల్లీలోని మాల్వియా నగర్ కాలనీలోని సావిత్రి నగర్ ప్రాంతంలో ఆయన పాదయాత్ర చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై ఓ ద్రవ పదార్థాన్ని విసిరారు. ప్రస్తుత బెదిరింపు ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

